క్లుప్తంగా

బీఎండీఏ అధ్యక్షుడిగా శ్రీనివాస్



బీఎండీఏ నూతన కార్యవర్గంతో అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు

మండపేట: మండపేట బిల్డింగ్ మెటీరియల్ డీలర్స్ అసోసియేషన్ (బీఎండీఏ) అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన లక్ష్మీ పెయింటర్స్ అధినేత కంచర్ల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీఎండీఏ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగింది. వ్యాపారవేత్త కర్రి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా గారపాటి రాజశేఖర్, కార్యదర్శిగా రిమ్మలపూడి ఈశ్వర్, కోశాధికారిగా లేగా శ్రీహరి, ఉపాధ్యక్షుడిగా యాళ్ల శ్రీనివాస్, సింఘంశెట్టి రఘు, ఎం. శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా కేశవరపు శ్రీనివాసరావు, మోరం పాపారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘాధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ బీఎండీఏ బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

వైభవంగా అయ్యప్ప సహస్రార్చన



రాయవరంలో పూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

రాయవరం: స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తుల నామస్మరణతో రాయవరం మార్మోగింది. స్థానికంగా అయ్యప్ప భక్తులు ఏర్పాటు చేసుకున్న ఆశ్రమంలో సహస్రార్చన పూజ వైభవంగా సాగింది. బుధవారం రాత్రి ఏడు గంటలకు అయ్యప్ప భక్తులు 18 కలశాలు ఏర్పాటు చేసి పీఠం గురుస్వామి పులగం శ్రీనివాసరెడ్డి (పీఎస్ఆర్) ఆధ్వర్యంలో కుమార్, దొరబాబు స్వాములు పూజాధికాలు, సహస్రార్చన నిర్వహించారు. ముందుగా స్వామివారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అయ్యప్పల పడిపూజ జరిగింది. ఇందులో జానికి రామారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, పవన్, గురుస్వాములు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవేశాల్లో ప్రథమం

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లాలో ఈ ఏడాది ఇంటర్ ప్రవేశాల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా ఇంటర్ బోర్డు అధికారి ఎస్.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక కళాశాలలో బుధవారం రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చక్కని ఉత్తీర్ణత సాధించేందుకు పాటుపడాలన్నారు. ప్రిన్సిపాల్ వి.సోమశేఖరరావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో తొలగింపు ఓట్ల గుర్తింపు

మండపేట: డూప్లికేట్స్, మృతి చెందిన, పోలింగ్ స్టేషన్ల మార్పునకు సంబంధించి నియోజకవర్గంలో 4,202 మంది తొలగింపు ఓట్లు గుర్తించినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి సుధాసాగర్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 ఇంటింటా సర్వే మొదలు పెట్టే నాటికి నియోజకవర్గంలో 2,14,346 ఓట్లు ఉన్నాయన్నారు. 3,246 మంది కొత్తగా ఓటు పొందేందుకు అర్హులుగా గుర్తించగా, 3,244 మృతుల ఓట్లు, పోలింగ్ స్టేషన్ల మార్పునకు 736 ఓట్లు, 222 నకిలీ ఓట్లు గుర్తించామని సుధాసాగర్ చెప్పారు. 1,184 డోరు నంబర్లలో 10 ఓట్లకు పైబడి 18,158 ఓటర్లు ఉన్నట్టు తమ సర్వేలో తేలిందన్నారు. ఇవన్నీ అపార్ట్‌మెంట్లు, ఎక్కువ పోర్షన్లు కలిగిన ఇళ్లలో ఉన్నాయన్నారు.

పశువులకు వ్యాక్సినేషన్

కె.గంగవరం: యర్రపోతవరంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పారుడు వ్యాధి (పీపీఆర్) నివారణకు బుధవారంవ్యాక్సినేషన్ జరిగింది. దీనిని వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, సర్పంచ్ పిల్లి రాంబాబు ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని సుమారు 600 మేకలు, గొర్రెలకు పశు వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. పశువైద్యాధికారి ఎం.కృష్ణార్జున్, విలేజ్ లైవ్ స్టాక్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ మేడిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

కపిలేశ్వరపురం: వరి పంటను ఆశించే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన అవసరమని అమలాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి.భవాని అన్నారు. మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో టేకి వ్యవసాయ క్షేత్రంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శాస్త్రవేత్త భవాని మాట్లాడుతూ వరి పంటలో ఆకునల్లి, పాము పొడ తెగులు ఉన్నట్టు గమనించామన్నారు. పాముపొడ తెగులు నుంచి పంటను రక్షించుకునేందుకు ప్రాపికోనాజోల్ 1 ఎంఎల్, హెగ్జాకోనాజోల్ 2 ఎంఎల్, వాలిడమైసిన్ 2 ఎంఎల్‌లను నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకుడు గంజా హరిబాబు, పొలంబడి గ్రూప్ లీడర్లు కొత్తపల్లి కృష్ణారావు, దామిన బుల్లిరాజు, కామిరెడ్డి రాముడు, కొండిపర్తి పట్టాభి రామయ్య, దాసరి వీరేంద్ర చౌదరి, చేకూరి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా..

- కొత్త పింఛన్ల మంజూరు
- నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్నవి 37.925
- కొత్తగా మంజూరైనవి 1.790
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సత్కరిస్తున్న డప్పు, చర్మకార పింఛన్ లబ్ధిదారులు

మండపేట: కులం చూడం.. మతం చూడం.. రాజకీయాలు చూడం.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామంటూ ఇచ్చిన వాగ్దానాన్ని ఆచరణలో చేసి చూపిస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పేదరికమే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి చెంతకే పింఛన్ సాయం అందిస్తున్నారు. తాజాగా మండపేట నియోజకవర్గానికి మంజూరైన 1,790 పింఛన్ల పంపిణీని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు.

వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళలు తదితర వర్గాల వారికి ఆసరాగా ప్రతి నెలా ప్రభుత్వం సామాజిక పింఛన్లు అందిస్తోంది. టీడీపీ హయాంలో లబ్ధిదారుల ఎంపిక ప్రహసనంగా సాగేది. అర్హులు జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. 1వ తేదీ నుంచి పింఛన్ నగదు కోసం లబ్ధిదారులు కమ్యూనిటీ హాళ్లు, ఆలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు పడిగాపులు పడేవారు. ఒక్కోసారి వారం రోజుల వరకు కూడా సాయం అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారుల ఎదురు చూపులకు చరమగీతం పాడారు సీఎం జగన్‌మోహన్ రెడ్డి. పొద్దు పొడవక ముందే గడప చెంత చేతికి అందుతున్న సాయాన్ని చూసి లబ్ధిదారులు మురిసిపోతున్నారు.

కొత్త పింఛన్ల మంజూరు

అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్ల మంజూరు చేస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. అర్హులైన వారు ఎక్కడికి తిరగాల్సిన పని లేకుండా తమ వివరాలను వలంటీర్‌కు అందిస్తే వారే సచివాలయాల్లో పేర్లు నమోదు చేయించి పింఛన్లు మంజూరు చేయిస్తున్నారు. ప్రస్తుతం మండపేట నియోజకవర్గంలో 37,925 మంది లబ్ధిదారులు ఉండగా కొత్తగా 1,790 పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో నియోజకవర్గంలోని లబ్ధిదారుల సంఖ్య 39,715కు పెరిగింది. మండపేట మండలం ఏడిదలో డప్పు కళాకారులు, చర్మకారులు 36 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా వారు ఆనందం వ్యక్తం చేస్తూ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ వసుమర్తి నాగబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఎంపీటీసీ సభ్యురాలు తాతపూడి ఉష ఆధ్వర్యంలో బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గంలో సామాజిక పింఛనుదారులు ఇలా..

మండలం	ప్రస్తుతం	కొత్తగా మంజూరైనవి
మండపేట అర్బన్	6779	328
మండపేట	11,567	699
రాయవరం	9726	194
కపిలేశ్వరపురం	9853	569

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ సాయం అందేలా లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరిగింది. కొత్త లబ్ధిదారులు అందరికీ పింఛన్ల పంపిణీని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు లాంఛనంగా ప్రారంభిస్తున్నారు.

–ఐ.రాజు, ఎంపీడీఓ, మండపేట

చాలా ఆనందంగా ఉంది



నాకు కొత్తగా చర్మకార పింఛన్ మంజూరు కావడం ఆనందంగా ఉంది. ఎక్కడికీ తిరగాల్సిన పనిలేకుండా వలంటీర్ మా వద్దకు వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. సీఎం జగన్ సర్‌కు రుణపడి ఉంటాం.

–ఉండ్రాజవరపు సంసోను, డప్పు కళాకారుడు, ఏడిద

పేదల ప్రభుత్వం మాది

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ పేదల ప్రభుత్వమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలో 569 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, నాయకుడు శీలం గోవిందు మాట్లాడుతూ పింఛన్ల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఒకటో తేదీనే పింఛన్లు అందజేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అర్హులందరికీ కుల, మత, ప్రాంతం, రాజకీయాలను చూడకుండా పింఛన్లు అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి ప్రతీక హిందీ

నేడు హిందీ దివస్



మాచర జెడ్పీ హైస్కూల్‌లో పాఠం చెబుతున్న హిందీ మాస్టార్ రేవు భీమారావు

కపిలేశ్వరపురం: అమ్మ భాష తెలుగుకు మూలం సంస్కృతం. సంస్కృతం నుంచి అనేక భాషలు పుట్టగా దేశంలో అత్యధిక రాష్ట్రాల్లో వెలుగొందుతున్న భాష హిందీ. దీనిని నేర్చుకుంటే దేశాన్ని చుట్టిరావొచ్చని భాషాకోవిదులంటారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలకు చెందిన సామాన్య ప్రజానీకం విద్యా, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవసరాలరీత్యా హైదరాబాద్, ఉత్తరాది హిందీ భాషా ప్రాంతాలతో మమేకమై ఉన్నారు. ఇక్కడి వారు ఆయా ప్రాంతాలతో బంధుత్వాలనూ కలిగి ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు హిందీని సబ్జెక్టుగా చదువుతున్నారు. గురువారం హిందీ దివస్ నేపథ్యంలో ఈ కథనం. పాఠశాల విద్యలో ఆరు నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులు హిందీని సబ్జెక్టుగా చదువుతారు. అయితే హిందీ బోధనలో ప్రాధాన్యం మరింత పెంచాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. జాతీయ భాషగా ఉన్న హిందీకి వారానికి ఐదు పీరియడ్లు మాత్రమే కేటాయించారు. దానిని ఆరుకు పెంచాలని అంటున్నారు.

సాహిత్య అధ్యయనానికి తప్పనిసరి



భారతీయ సాహిత్యం అత్యధికంగా హిందీ భాషలో లభ్యమవుతుంది. విలువైన సాహితీ సంపద హిందీ భాషలో నిక్షిప్తమై గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంది. హిందీ రాక దక్షిణాది రాష్ట్రాల్లో ఆ సాహిత్యాన్ని చదివే అవకాశాన్ని కోల్పోతున్నారు. హిందీ నేర్చుకోవడం ద్వారా విజ్ఞాన సముపార్జనతో పాటు ఉద్యోగావకాశాలు సైతం పొందవచ్చు.

–టి.మోహన్‌దాస్ గాంధీ, హిందీ టీచర్, వల్లూరు జెడ్పీ హైస్కూల్

తైక్వాండోలో విద్యార్థి ప్రతిభ



అరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సత్యలత తదితరులు

రామచంద్రపురం: విజయవాడలో జరిగిన సౌత్ నేషనల్ తైక్వాండో 60 కిలోల విభాగంలో స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కె.అరుణ్ కుమార్ బంగారు పతకం సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత బుధవారం తెలిపారు. అక్టోబర్‌లో జరిగే ఆలిండియా తైక్వాండో పోటీలకు అరుణ్‌కుమార్ అర్హత సాధించారన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, వ్యాయామ విభాగ అధిపతి బీవీవీ సాగర్, వీరబాబు తదితరులు అభినందించారు.

కపిలేశ్వరపురం: విజయవాడలో వైఎస్సార్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీల్లో నల్లూరు విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. గ్రామానికి చెందిన శలా రాజు గ్రీన్ బెల్ట్ స్పారింగ్ సీనియర్స్ విభాగ పోటీల్లో సిల్వర్ మెడల్ పొందాడు. రాజును సీనియర్ కరాటే మాస్టార్ టి.అబ్బులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

మండపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపిక బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఎంపీడీఓ ఐ.రాజు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక ధృడత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోను రాణించాలన్నారు. మండపేట పట్టణం, మండల పరిధిలోని 13 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 253 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్– 14, 16 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్, షటిల్ తదితర తొమ్మిది క్రీడాంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గురువారం బాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ ఎస్. రామచంద్రరావు తెలిపారు. ఈనెల 20న నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం గెడా శ్రీనివాసరావు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సామాజిక వర్గానికే అగ్రాసనం


- మళ్లీ మార్కెట్ కమిటీ చైర్మన్‌గిరీ
- పండు గోవిందరాజుకే అవకాశం



ద్రాక్షారామ మార్కెట్ యార్డు కార్యాలయంలో సమావేశమైన ఎస్సీ సామాజికవర్గ నేతలు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గంలో మరోసారి ఎస్సీ సామాజిక వర్గానికి మార్కెట్ కమిటీ చైర్మన్‌గిరీ దక్కింది. ప్రస్తుతం ద్రాక్షారామ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న పండు గోవిందరాజుకే ఎమ్మెల్యే, రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రెండోసారి అవకాశం కల్పించారు. ఈ మేరకు ప్రభుత్వ జీఓ విడుదల అయ్యింది. దీనిపై ద్రాక్షారామ మార్కెట్ యార్డు కార్యాలయం వద్ద సమావేశమై ఎస్సీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి వేణుగోపాలకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బత్తుల అప్పారావు, సర్పంచ్ అంబటి తుకారం, కొండేపూడి అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు పరమటి జ్ఞానలక్ష్మి, యెన్నం దేవి, నాయకులు పోతురాజు బాబూరావు, గుంటూరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిసారి నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించిందని డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు అన్నారు. రెండో సారి కూడా జీవో విడుదల చేయడం హర్షణీయమన్నారు. త్వరలోనే భారీ ఎత్తున ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహిస్తామన్నారు.

ఎస్సీలకు పెద్దపీట



నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఎస్సీ సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తున్నారు. ఇప్పటికే పలు నామినేటెడ్ పదవులతో పాటు నియోజకవర్గ స్థాయిలో ప్రాధాన్యం ఉన్న మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని రెండో సారి కూడా ఎస్సీ సామాజిక వర్గానికే అందించారు. సీఎం వైఎస్ జగన్, మంత్రి వేణులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

–పండు గోవిందరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్

కె.గంగవరం: ద్రాక్షారామ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రెండోసారి పండు గోవిందరాజు ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. హర్షం తెలిపిన చేసిన వారిలో మండల సచివాలయ కన్వీనర్ తోకల శ్రీను, దళిత నాయకులు తదితరులు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



మెప్మా బజార్‌లో స్టాల్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు తదితరులు

మండపేట: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, కౌన్సిలర్లతో కలిసి ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలకు మెప్మా బజార్ మంచి వేదికన్నారు. రాజుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో మంచి ఉత్పత్తులు తీసుకువచ్చి మార్కెటింగ్ చేసుకుని అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పలు పొదుపు సంఘాల మహిళలు తయారుచేసిన ఎంబ్రాయిడరీ చీరలు, అల్లికలు, పచ్చళ్లు, పిండి వంటలు తదితర వాటిని ప్రదర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, నాయకులు ముక్కా దాలయ్య, శెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



లొల్లలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు

రాయవరం: లొల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం కొవ్వూరి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చేవా సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్ లంక శ్రీను, దేవస్థానం చైర్మన్ వీర్రాజు, ఎంఈఓలు పి.లక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు. బదిలీపై వెళ్లిన గొలుగూరి మునిరెడ్డి, సుబ్బారావు, అబ్బిరెడ్డి సత్యనారాయణ, రాజేష్‌లను సత్కరించారు.

పోస్టుల భర్తీకి చర్యలు

కె.గంగవరం: పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ ఎ.అంజిబాబు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాల మేరకు కాలేజీలో మ్యాథ్స్, ఫిజిక్స్ విభాగాల్లో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంబంధిత పోస్టులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని, 19న కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

మహిళలకు కుట్టుమెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న సభ్యులు

కె.గంగవరం: ఊడిమూడిలో కాకినాడకు చెందిన రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. క్లబ్ సర్వీస్ డైరెక్టర్ తాడా వీరవెంకట సత్యనారాయణ (బుజ్జి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన 80 మంది మహిళలకు కుట్టు మెషీన్లు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రొటేరియన్ పీడీ జీఎల్ సత్యనారాయణ, డీజీఎస్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, సర్పంచ్ కోటిపల్లి సుబ్బారావు, నాయకుడు టేకుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

రాయవరం: చెల్లూరు పరిధి పసలపూడి వంతెన సమీపంలో చింతా సుబ్బారాయుడు చారిటబుల్ ట్రస్ట్ వద్ద గురువారం వైఎస్సార్ పింఛన్ల కానుక కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ నౌడు వెంకటరమణ తెలిపారు. ఉదయం 10 గంటలకు మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అందజేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మండపేట: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత దూలి జయరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జయరాజు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. శిబిరానికి నియోజకవర్గంలోని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో షేక్ నబీ, మేడిశెట్టి రాంబాబు, బొజ్జా రామకృష్ణ, మేడిద అబ్బులు, మందపల్లి నరేష్, మందపల్లి లాజర్ పాల్గొన్నారు

నేడు వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

రాయవరం: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశామని ఎంఈఓలు పి.లక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ బుధవారం తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉదయం 10.15 గంటలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు.

చదువుతోపాటు క్రీడలూ అవసరం



రామచంద్రపురంలో మాట్లాడుతున్న డీవైఈఓ సత్యనారాయణరెడ్డి



పామర్రులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి

రామచంద్రపురం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ అవసరమని డీవైఈఓ ఎస్.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం రాష్ట్ర అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్, బేస్‌బాల్, త్రోబాల్ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఫెడరేషన్ కన్వీనర్, పీడీ జంపన రఘురాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ వి.సోమశేఖరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి హాజరయ్యారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గెలుపోటములను విద్యార్థులు సమానంగా స్వీకరించాలన్నారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో 60 మంది బాలురు, 40 మంది బాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి, పీడీల అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాం, అండర్– 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరామకృష్ణ, సతీష్, ఈవీవీ సత్యనారాయణ, రిటైర్డు పీడీ సీతాపతి, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో..

కె.గంగవరం: పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ పంపన నాగమణి, ఎంఈఓ నాగరాజు తదితరులు ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని పది ఉన్నత పాఠశాలలకు చెందిన బాలురకు ఎంపికలు నిర్వహించడంతో పాటు వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర పోటీలు జరిగాయి. గురువారం బాలికలకు కూడా పోటీలు ఉంటాయన్నారు. ఎంఈఓ– 2 ఆంజనేయులు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి చర్యలు

కాజులూరు: గొల్లపాలెంలో కొత్తగా పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఇక్కడ పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లోని ఇరుకు గదులలో పోలీస్ స్టేషన్ నిర్వహణను ఆయన గమనించారు. కాకినాడ, కోటిపల్లి రహదారిలో స్టేట్ బ్యాంక్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని గ్రామ పంచాయతీ పోలీస్ స్టేషన్‌కు కేటాయించి తీర్మానం చేసిందని స్థానికులు తెలపడంతో ఆ స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. సిబ్బంది, ఫిర్యాదుదారుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్సై బాలరాజు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.